## క్లుప్తంగా

### త్రైత సిద్ధాంత యుగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

భీమవరం: శ్రీక్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత యుగాది తెలుగు క్యాలెండర్‌ను ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక భీమవరం సభ్యుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన జ్ఞాన తెలుగు క్యాలెండర్‌లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థం అయ్యే విధానంగా రూపొందించారన్నారు. ఇంకా అనేక విశేషాల్లో భాగంగా దేవాలయం సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగులు, నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకాల సారంతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత సారాంశం ఇందులో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.నాగేశ్వరరావు, లోకేష్, వాసుదేవరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### 17 నుంచి కాళ్ళకూరు వెంకన్న కల్యాణోత్సవాలు



కాళ్ళకూరు ఆలయంలో పోస్టర్ విడుదల చేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

కాళ్ళ: కాళ్ళకూరు గ్రామంలో స్వయంభూ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 17వ తేదీ శుక్రవారం నుంచి 25వ తేదీ శనివారం వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎం అరుణ్‌కుమార్ ఆదివారం తెలిపారు.ఈ మేరకు ఆయన అధికారులు, అర్చకులు సిబ్బంది ఆలయ ప్రాంగణంలో కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

### కళకళలాడిన బీచ్‌లు



బీచ్‌లో సందర్శకుల సందడి

మొగల్తూరు: మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఇటీవల కాలంలో బీచ్‌కు వచ్చే వరి సంఖ్య తగ్గినా ఆదివారం ఎన్నికల సెలవుల నేపథ్యంలో పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వాతావరణం కూడా ఆహ్లాదకరంగా ఉండడంతో బీచ్‌కు వచ్చిన సందర్శకులు సముద్రస్నానం చేస్తూ గడిపారు. అనంతరం తీరంలోని ఆలయాలను సందర్శించుకున్నారు.

### ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ముదునూరి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

నరసాపురం : ముదునూరి ప్రసాదరాజు గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ మెర్లిన్ పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఏ నియోజకవర్గానికి లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురానికి ముదునూరి మీద ఉన్న అభిమానం, ఇద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యంతో పెద్ద ఎత్తున నిధులు ఇచ్చారన్నారు. మళ్లీ ముదునూరి ప్రసాదరాజును గెలిపించుకోవడం ద్వారానే నియోజకవర్గంలో అభివృద్ధి పరంపర కొనసాగుతుందని వివరించారు. ముదునూరి మంచి క్రమశిక్షణ కలిగిన వ్యక్తని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల విధానాలపైనే గానీ ఎప్పుడూ ఎవరినీ వ్యక్తిగతంగా చిన్నమాట కూడా అన్న సందర్భం లేదన్నారు. హుందాతనంతో కూడిన రాజకీయాలు చేయడంలో ముదునూరి తరువాతే ఎవరైనా అన్నారు. వశిష్ట వంతెన, ఫిషింగ్ హార్బర్, ఫిషరీస్ యూనివర్సిటీ లాంటి ప్రాజెక్ట్‌లు ముదునూరి ఐదేళ్ల పాలనలో మైలురాయిగా నిలుస్తాయని చెప్పారు.

# భీమవరంలో ఫ్యాన్ జోరు

- అభివృద్ధిని పరుగులు పెట్టించిన శ్రీనివాస్
- క్యాడర్‌ను కూడగట్టుకోవడంలో గ్రంధి దూకుడు
- ఐదేళ్లుగా ప్రజలకు అందుబాటులోలేని అంజిబాబు
- కూటమి ప్రచారంలో కుమ్ములాటలు



భీమవరం మండలం శ్రీరామపురంలో నిర్మించిన వైఎస్సార్ విలేజ్‌హెల్త్ క్లినిక్ భవనం (ఫైల్)



భీమవరం మండలం శ్రీరామపురంలో నిర్మించిన సచివాలయ నూతన భవనం (ఫైల్)

భీమవరం: నియోజకవర్గంలో ఫ్యాన్ హోరుకు కూటమి బేజారెత్తుతోంది. ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ తనదైన శైలిలో పార్టీ నాయకులు, కార్యకర్తలను కూడగట్టుకుని దూసుకుడుగా వ్యవహరించారు. కూటమి తరఫున జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అభ్యర్థిత్వాన్ని ఆలస్యంగా ప్రకటించడంతో పాటు అప్పటి వరకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తారని ఆశించిన ఆపార్టీ క్యాడర్‌కు అంజిబాబు అభ్యర్థిత్వం మింగుడుపడలేదు. జనసేనలో గ్రూపులు, టీడీపీ, బీజేపీ నాయకులు సహకరించకపోవడంతో ప్రచారంలో అంజిబాబు వెనుబడిపోయారు. ఎన్నికల ప్రచారానికి ముందులోనే కూటమి నాయకులు కొంతమంది గత ఎన్నికల్లో అంజిబాబు ఓటమి గల కారణాలను వివరించి ప్రస్తుత ఎన్నికల్లో సరిచేసుకోవాలని సూచించినా ఆయన పెడచెవిని పెట్టడంతో క్యాడర్ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**● నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించిన గ్రంధి**

భీమవరం నియోజకవర్గంలోని భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం రూరల్ మండలాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గత ఐదేళ్లుగా అభివృద్ధిని పరుగులు పెట్టించారు. పట్టణాన్ని జిల్లా కేంద్రం చేయించడంతో భీమవరంలో రూపురేఖలు మారుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వివిధ పనులపై రాజకీయనాయకులు, ప్రజలు వస్తుండడంతో పట్టణం నిత్యం జనంతో కళకళలాడుతోంది. ఇప్పటికే విద్య, వైద్య కేంద్రంగా గుర్తింపు తెచ్చుకున్న భీమవరం జిల్లా కేంద్రం కావడంతో మరింత శోభను సంతరించుకుంది. దీనికితోడు ఐదేళ్లుగా దాదాపు రూ.132 కోట్లు వ్యయంతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించడంతో పాటు మంచినీటి సమస్య పరిష్కారానికి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం, ట్రాఫిక్ సమస్యను అధికమించడానికి అయిదు చోట్ల రైల్వే అండర్‌పాస్‌ల నిర్మాణం, కొత్తగా జగనన్న కాలనీ, 100 పడకల ఆస్పత్రి నిర్మాణం పనులతో పాటు పట్టణ ప్రజలకు రాష్ట్రప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలకు గాను సుమారు రూ. 314 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే భీమవరం రూరల్, వీరవాసరం మండలాల్లో రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణంతో పాటు రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ వంటి అభివృద్ధి పనులకు సుమారు రూ. 193.85 కోట్లు ఖర్చు చేయగా సంక్షేమ పథకాల ద్వారా రెండు మండలాల్లోని లబ్ధిదారులకు సుమారు 1,237.41 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. శ్రీనివాస్ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతం కృషిచేయడంతో ఆయన పట్ల ప్రజల్లో ప్రగాఢమైన నమ్మకం ఏర్పడింది.

**● అందుబాటులో ఉండని అంజిబాబు.....**

గతంలో కాంగ్రెస్, టీడీపీ పార్టీల నుంచి రెండు పర్యాయాలు భీమవరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన అంజిబాబు ఆయా పార్టీల్లోని నాయకులను పట్టుమని 10 మందిని కూడా గుర్తించాలేరనే అపవాదును మూటకట్టుకున్నారు. ప్రజలకే గాకుండా కనీసం పార్టీ క్యాడర్‌కు కూడా దూరంగా ఉండే ఆయన పట్ల జనసేన అభ్యర్థిత్వం ప్రకటించిన నాటి నుంచే మూడు పార్టీల్లోను తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీనితోనే అప్పటి టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు) ఎన్నికల ప్రచారంలో అంటిముట్టనట్లు వ్యవహరించారనే ప్రచారముంది. అంజిబాబు గత ఎన్నికల్లో ఓటమి అనంతరం పార్టీలకు దూరం కావడమేగాక కరోనా వైరస్ సమయంలో ప్రజలను కనీసం కన్నెత్తి చూడలేదని అటువంటి వ్యక్తికి ఓట్లు ఎలా వేయించాలని జనసేన, టీడీపీ, బీజేపీ క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. దీనికితోడు ఎన్నికల ప్రచారంలో ప్రజలకు నిత్యం అందుబాటు ఉంటానని చెప్పకుండా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటానని చెప్పడం కార్యకర్తలను అంతర్మథనం పడేవిధంగా చేసిందంటున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడంతో 2019 ఎన్నికల్లో మాదిరిగానే ప్రస్తుత ఎన్నికల్లోను అంజిబాబు విఫలమయ్యారని వాపోతున్నారు. సోమవారం పోలింగ్ జరుగుతున్న తరుణంలో జనసేన, టీడీపీ క్యాడర్ ఢీలాపడిపోవడం చూస్తుంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థి శ్రీనివాస్ అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమనే సంకేతాలు వెలువడుతున్నాయి.

### ఘనంగా మాతృదినోత్సవం



భీమవరంలో మాతృదినోత్సవం సందర్భంగా కామేశ్వరమ్మను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో ఆదివారం మాతృదినోత్సవాన్ని విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సేవకురాలు 84 ఏళ్ల వయస్సు కలిగిన కలిగొట్ల కామేశ్వరమ్మను స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సత్కరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ సృష్టిలో జన్మనిచ్చిన తల్లి ప్రథమ స్థానంలో ఉంటుందని, పిల్లల భవిష్యత్తుకు తల్లి పడే కష్టం వర్ణనాతీతమన్నారు. వృద్ధాప్యానికి చేరిన తల్లులను ప్రతి ఒక్కరూ ప్రేమతో ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు కలిగొట్ల గోపాలశర్మ, అల్లు శ్రీనివాస్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీమ్, గ్రంధి నర్సింహమూర్తి, జాన్సీ, దేగల భవాని సీతల్, శ్రీలత దేవి, సంతోష్, మోటేపల్లి రామకృష్ణ, కోమలీదేవి, హర్ష నాగ సూర్య తదితరులు పాల్గొన్నారు.

### మంచి కోసమే ఈ ప్రయాణం



నా ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరబాద్ నుంచి మా ఊరుకి వచ్చా. మంచి చేసినవారిని మళ్లీ ఎన్నుకునేందుకు తరలివచ్చా. అమ్మ ఒడి పథకం మా కుటుంబానికి ఎంతో ఉపయోగపడింది. మాకు మంచి చేసిన ప్రభుత్వానికి ఓటు వేసి రుణం తీర్చుకుంటా.

– పళ్ళేం అరుణ, ఎన్నార్పీ అగ్రహారం, ఉండి మండలం

# ఉండిలో అభివృద్ధి పరవళ్లు

- అభివృద్ధికి కేరాఫ్ పీవీఎల్...
- ఉండిలో జోరుగా వీస్తున్న ఫ్యాన్‌గాలి...



తాళ్లకోడులో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీ(ఫైల్)



ఆకివీడులో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్ (ఫైల్)

ఆకివీడు: రాజకీయ ఉద్దండులకు నిలయంగా ఉన్న ఉండి నియోజకవర్గంలో పదిహేనేళ్ళ తరువాత ఉండి కంచుకోటపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురనుందని విశ్లేషకులు బాహాటకంగా చెప్పుకుంటున్నారు. ఏ గ్రామం వెళ్లినా, ఏ ప్రాంతం వెళ్లినా, ఎవరిని పలకరించినా ఫ్యాన్, ఫ్యాన్ అంటున్నారు. త ఎనిమిదేళ్లగా నియోజకవర్గంలో క్షణికం తీరిక లేకుండా ప్రతీ గడప గడపకూ తిరిగి ప్రజా క్షేత్రంలో నేనున్నానంటూ భరోసానిస్తూ ప్రభుత్వ పథకాల్ని ప్రజలకు అందజేస్తూ, ప్రజా సమస్యలు పరిష్కారిస్తూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఉండి అసెంబ్లీ అభ్యర్థి పీవీఎల్.నర్సింహరాజు ప్రజలకు అందుబాటులో ఉన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఆయన పేరేంటో తెలియదు, ఆయన ఊరేంటో తెలియదు గానీ అందరూ పీవీఎల్, పీవీఎల్ అంటూ ఆయన వెన్నంటే ఉంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఆయన అందుబాటులో ఉంటూ అహార్నిశలూ ప్రజా సేవే పరమావధిగా పనిచేస్తున్న పీవీఎల్‌ను ఈ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఓటమి విజయానికి నాంది అన్నట్లుగానే గత ఎన్నికల్లో ఆయన ఓటమి చవిచూసినా, ఈ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని చూస్తున్నారు. అందుకే నియోజకవర్గంలో ఆయన విజయం నల్లేరుపై నడకే అంటున్నారు ప్రజలు.

**రాజకీయమే కాదు, నిజాయితీ ఆయన వారసత్వం**

పీవీఎల్. తిమ్మరాజు పెద్ద కుమారుడుగా రాజకీయ వారసత్వం పొందిన పెన్మెత్స వెంకట లక్ష్మీ నర్సింహరాజు(పీవీఎల్) రాజకీయ వారసుడే కాదు, నిజాయితీకి కూడా ఆయన వారసుడు. నాడు తండ్రి తిమ్మరాజు రాజకీయ చతురత్వంతో 17 ఏళ్ల పాటు ఆకివీడు సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. ఏ విధమైన ఆరోపణలు లేని ఆయన నియోజకవర్గ అభివృద్ధికి బాట వేశారు. పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ప్రత్యేక కాలనీలను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్ని అనుసంధానం చేస్తూ రోడ్ల నిర్మించారు. అదే వారసత్వంతో పీవీఎల్ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పేద ప్రజలకు 16 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశారు. పేదలు రోడ్ల వెంబడి, కాలువ గట్ల వెంబడి జీవిస్తూ తరాలు గడిచినా వారి తల రాత మారలేదనే ఆవేదనతో వారికి పట్టాలు అందజేసి ఇళ్ల నిర్మాణానికి సహకరించారు. పల్లెల్లో రహదారుల నిర్మాణం ద్వారానే అభివృద్ధి సాధ్యమని భావించి పలు రహదారుల్ని పీవీఎల్ నిర్మించారు. బురద మయంగా ఉండే వీధి రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మించారు.

**రెండు సార్లు రైతు బాంధవుడుగా జాతీయ అవార్డు**

రైతులకు సేవ చేయాలనే ఆశయంతో ఆయన నియోజకవర్గంలోని యండగండి వ్యవసాయ సహకార బ్యాంక్‌కు అధ్యక్షుడిగా 28 ఏళ్లు పాటు పనిచేశారు. బ్యాంక్ అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవల్ని గుర్తించి జాతీయ స్థాయిలో ఉత్తమ సహకర బ్యాంక్ అధ్యక్షుడిగా అవార్డులు పొందారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగుతోన్న పీవీఎల్ సేవల్ని గుర్తించి జగన్ మోహన్ రెడ్డి ఆయనకు జిల్లా సహకర బ్యాంక్(డీసీసీబీ) అధ్యక్షుడిగా నియమించారు. నియోజకవర్గంలో ప్రజల అభిమానం, ఆదరణ, పార్టీపై ఉన్న పట్టు కోల్పోకూడదనే ఉద్దేశ్యంతో డీసీసీబీ చైర్మన్ పదవితో పాటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతల్ని కూడా ఆయనకే అప్పగించారు.

**సొంతింటి కల నెరవేర్చారు**

నియోజకవర్గంలో పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి తలపెట్టిన మహోన్నత ఆశయాన్ని స్వర్గీయ సర్రాజు కృషితో పేదలకు సొంతింటి కలను నెరవేర్చే దిశగా 74 ఎకరాల భూమి కొనుగోలుతో పాటు పలు గ్రామాల్లో ఇళ్ల స్థల సేకరణ జరిగింది. దశాబ్దకాలం పాటు పేదలకు ఇళ్ల పట్టాలను టీడీపీ ప్రజాప్రతినిధులు పంపిణీ చేయలేదు. దీంతో పీవీఎల్.నర్సింహరాజు ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించిన వెంటనే పేదోడి సొంతింటి కల నెరవేర్చారు. తాళ్లకోడులోని 74 ఎకరాల్లో 3,600 మందికి పట్టాల పంపిణీ చేశారు. వివిధ గ్రామాల్లో మొత్తం 16,000 మందికి పైగా లబ్ధిదారులకు పట్టాలు అందజేసి, నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని పేదలకు ఇళ్ల నిర్మాణానికి సహాకరించి వారి కుటుంబాల్లో పండుగ వాతావరణం తీసుకువచ్చారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గంలో 38,59,474 మంది లబ్ధిదారులకు రూ.38,62,56,33,501లు, నాన్-డీబీటీ క్రింద వివిధ పథకాల ద్వారా నియోజకవర్గంలో 29,31,797 మంది లబ్ధిదారులకు రూ. 1,23,56,10,464లు లబ్ధి జరిగింది.

### క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 34 మంది ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని శ్రీసూర్యా డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 34 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంఎన్‌సీ కంపెనీలైన స్కిల్ దునియా, స్టార్‌టెక్, టాలెంట్ సర్వీస్ సంస్థలు ఇంటర్వ్యూలు జరిపినట్టు కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ చెప్పారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ మాట్లాడుతూ అర్థమెటిక్, రీజనింగ్ సబ్జెక్ట్స్‌లో విద్యార్థులు పట్టు పెంచుకోవాలన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. స్కిల్ ఇండియా కంపెనీ సీఈవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శంకర జయంతి సందర్భంగా స్థానిక శంకరమఠం దేవస్థానంలో ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి, సర్వ మంగళమ్మ అమ్మవారికి, స్పటిక లింగానికి ఆదివారం విశేష అర్చనలు జరిగాయి. వేదపండితులచే అరుణపారాయణం, అమ్మవారికి విశేష కుంకుమార్చనలు చేశారు. స్వామి, అమ్మవార్లుకు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు గరికపాటి బాపయ్య శర్మ, మహతి, పండు, కౌశిక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### ఓటు వేయడం మన బాధ్యత

ఉండి: ఓటు వేయడం మన కనీస బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ సీవీ ప్రవీణ్‌ఆదిత్య ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్‌ను, తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునేందుకు తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు.అలాగే అన్ని పార్టీల ప్రతినిధులు,అభ్యర్థులు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని అన్నారు.ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా గట్టి భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.అలాగే నిరంతరాయంగా వెబ్‌కాస్టింగ్, అధికారుల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు ఏర్పాట్లు చేసామన్నారు. పోలింగ్‌కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, వీల్‌చైర్స్, ర్యాంపులు, ప్రథమచికిత్స సేవలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం



పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న అధికారులు



కాళ్ళకూరు గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పూర్తి చేసిన దృశ్యం

ఉండి: సోమవారం నిర్వహించే పోలింగ్ కొరకు సర్వం సిద్ధంగా ఉంచినట్లు ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి,జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్‌ఆదిత్య తెలిపారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఆదివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఎల్ నిర్మల్‌రాజ్‌తో కలసి పర్యవేక్షించారు. సాయంత్రానికి అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ద్వారా పోలింగ్ యంత్రాలను పంపించి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 238 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే పోలింగ్ కొరకు 1,10,146 మంది పురుషులు,1,14,577 మంది మహిళలు,ఇద్దరు ట్రాన్స్‌జెండర్స్‌తో కలసి మొత్తం 2,24,725 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు ఆయన తెలిపారు.అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, అధికారులను బస్సుల్లో తరలించినట్లు తెలిపారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా గట్టి భద్రత ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

కాళ్ళ: మండలంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. మడలంలోని 62 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన అధికారులు సిబ్బంది, పోలింగ్ కేంద్రాలను చేరకున్నారు. ఈవీఎంలు, పోలింగ్ మెటీరీయల్స్‌తో పాటు సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. అధికారులు కూడా వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి జరిగే పోలింగ్ కొరకు సర్వం సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

**గమనిక**

వీరవాసరం మండలం, వీరవాసరం గ్రూపు దేవాలయ భూములు సేద్యం వేలం ప్రకటన ది.12.05.2024న సాక్షి పత్రికలో ప్రకటించడమైనది. శ్రీ గోగులమ్మ అమ్మవారి దేవస్థానం భూములు, శ్రీ రామలింగేశ్వర స్వామి భూములు మరియు వీరేశ్వర విశ్వేశ్వర స్వామి వారి భూములు మూడు సంవత్సరములకు వేలం పాటలు ది.24.05.2024న ఉ.గం.9-00 నుండి నిర్వహించబడునని గమనించగలరు.

కార్యనిర్వహణాధికారి
వీరవాసరం గ్రూపు దేవాలయాలు

# జగనన్న ఇల్లు...సంతోషాల హరివిల్లు

- నియోజకవర్గంలో 16,800 మందికి ఇళ్ల పట్టాలు
- ఇళ్ల నిర్మాణంలో 9,400 మంది లబ్ధిదారులు



జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించిన దృశ్యం



జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఇళ్లు

ఆకివీడు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ ఇళ్ల పథకాన్ని అమలు చేశారు. పేదలకు స్థలాలు కేటాయించారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో అవస్థలు పడుతుఊ కాలం వేళ్లదీస్తున్న వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గంలో ఇంటి స్థలాలు అందించారు. దీంతో నియోజకవర్గం గ్రామాగ్రామాన జగనన్న కాలనీలు ఊళ్లను తలపించేలా గృహనిర్మాణాలు పూర్తయ్యాయి. కాలనీల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రోడ్లు,తాగునీరు,మౌలిక వసతుల పనులు చకాచకా పూర్తయ్యాయి. ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వం కేటాయించిన సెంటున్నర స్థలంలో లబ్ధిదారులు ఇళ్లను అత్యంత ఆకర్షణీయంగా నిర్మించుకున్నారు. ఉండి నియోజకవర్గలోని పలు గ్రామాల్లో సుమారు 16,800 మంది నిరుపేదలకు ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశారు. దానిలో 9,400 మందికి ఇళ్ల నిర్మాణానికి రూ. 1.80 లక్షలు మంజూరు చేయించారు. వేలాది మంది ఇళ్ల నిర్మాణం వేగంగా చేపట్టి తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటున్నారు. నియోజకవర్గంలో సుమారు 1985 మంది గృహప్రవేశాలు చేసి, సొంత ఇంటిలో హాయిగా జీవిస్తున్నారు.

**వేగంగా మౌలిక వసతులు**

జగనన్న కాలనీల్లో వేగంగా మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నారు. విద్యుత్, మంచినీటి సౌకర్యంతో పాటు, రోడ్ల నిర్మాణం జరుగుతోంది. విద్యుత్ సౌకర్యం కోసం కాలనీనలో సుమారు 850 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. 120కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా 33 కేవీ సబ్ స్టేషన్‌ను నిర్మాంచారు.విద్యుత్ కాంతుల తోకాలనీ కళకళలాడుతోంది.

**సర్వ మత సమ్మేళనం**

గతంలో కాలనీ అంటే ఎస్సీలు, ఎస్టీలు ఇతర వర్గాలుగా విభజించి కాలనీలను ఊరు శివారు ప్రాంతాల్లో స్థలం కేటాయించి కాలనీని ఏర్పాటు చేసేవారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆ విధానానికి స్వస్తి చెప్పి అందరూ సమానమనే భావంతో కాలనీలో కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో 3,600 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. కులం, మతం, వర్గం, పార్టీ భేదం చూడకుండా పట్టాలు పంపిణీ చేశారు. ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు.